క్లుప్తంగా

బలరామావతారంలో జగన్నాథుడు


బలరామావతారంలో జగన్నాథుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత ఆలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణు గోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు కనులపండువగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం జగన్నాథ స్వామి బలరాముడి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఆవరణలో పలువురు మహిళలు, వృద్ధులు నిర్వహించిన విష్ణు సహస్రనామ పారాయణం భక్తులను అలరించింది.

ఎండోమెంట్ ఈఓ బాధ్యతల స్వీకరణ


టి.లక్ష్మి, ఎండోమెంట్ ఈఓ

కొయ్యలగూడెం: ఎండోమెంట్ ఈఓగా తెలగంశెట్టి లక్ష్మి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత గోపాల స్వామి, కన్నాపురం శ్రీ సీతారామచంద్ర స్వామి వార్ల ఆలయాల ఆస్తుల పరిరక్షణకు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఆరో తేదీ తొలి ఏకాదశి వేడుకలు దేవదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయాలలో నిర్వహించడానికి ఏర్పాట్లను చేశామని తెలిపారు.

పంగిడిగూడెం మాజీ సర్పంచ్ మృతి


కొండయ్య (ఫైల్)

ద్వారకాతిరుమల: మండలంలోని రాజా పంగిడిగూడెంకు చెందిన మాజీ గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు చిన్నం కొండయ్య (70) శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. గత కొద్ది రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కొండయ్య ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. కొండయ్య మృతికి వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ సంతాపం తెలిపింది.

బడికి పోదాంపై అవగాహన


మాట్లాడుతున్న ఎంఈఓ సురేష్ బాబు

కొయ్యలగూడెం: బడికి పోదాం అవగాహన కార్యక్రమాన్ని పరింపూడి ఎంపీపీ స్కూల్లో శుక్రవారం నిర్వహించారు. ఎంఈఓ జె.సురేష్ బాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ కె.కిరణ్ కుమార్ మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వారం రోజులపాటు పలు గ్రామాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో బడికి పోదాం కార్యక్రమాలు నిర్వహించనున్నారని, ప్రజల్లో ప్రభుత్వ పాఠశాలల పట్ల విశ్వసనీయతను పెంపొందించడమే ఇందులో భాగమని తెలిపారు. పాఠశాల యాజమాన్య కమిటీలు పర్యవేక్షణలో ఐదేళ్లు పూర్తి చేసిన వారు బడిబాట పట్టించాలన్నిరు. ప్రధానోపాధ్యాయులు ఎన్వీ సతీష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

టి.నరసాపురం: మండలంలోని బండివారిగూడెం, మర్రిగూడెం, టి.నరసాపురం, రాజుపోతేపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. పనులు చేసే సమయాల్లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

దొరసానిపాడు ఫీడర్ పరిధిలో..

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడు టౌన్ ఫీడర్‌లో ఆర్డీఎస్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఈఈ ఎం.అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెంలో పలు మందుల షాపులల్లో శుక్రవారం జంగారెడ్డిగూడెం ఇన్‌చార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబిద్ అలీ షేక్ తన బృందంతో ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ షాపుల్లో వయాగ్రా, అబార్షన్ కిట్‌లు ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకున్న కచ్చితమైన సమాచారంతో తనిఖీలు చేయగా భారీ మొత్తంలో వయాగ్రా, అబార్షన్ కిట్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ స్టాక్ రాజమండ్రికి చెందిన వ్యక్తి హైదరాబాద్ నుంచి తెచ్చి వివిధ షాపుల్లో విక్రయిస్తున్నట్టు గుర్తించామన్నారు. అయితే అత్యధికంగా ఆర్ఎంపీ, పీఎంపీలకు మెడికల్ షాపులో విచ్చలవిడిగా అమ్ముతున్నట్టు తెలిపారు.

ఘనంగా అల్లూరి జయంతి


జంగారెడ్డిగూడెం : అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


కొయ్యలగూడెం : దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం అప్‌లాండ్ క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ పార్కులో ఉన్న అల్లూరి విగ్రహానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న పేరిచర్ల జగపతిరాజు, కార్యదర్శి నంబూరు రామచంద్ర రాజు, సమితి సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. క్షత్రియ సేవా సమితి కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి, స్థానిక ఏలూరు రోడ్డు, అశ్వారావుపేట రోడ్డులో ఉన్న అల్లూరి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రుద్రరాజు ఝాన్సీలక్ష్మి, పెన్మెత్స శ్రీలక్ష్మి వాసవి వసంతి, నంబూరి పుష్పవతి, వెంకట రామ కృష్ణంరాజు, చినబాబు, సత్యనారాయణరాజు, సత్యంరాజు, మంతెన సత్యనారాయణరాజు, వై.నాగరాజు, లక్ష్మీ మురళి వర్మ, ఎం.రాంబాబు, శ్రీనివాసరాజు రామరాజు పాల్గొన్నారు.

చింతలపూడిలో..

చింతలపూడి : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని చింతలపూడిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న అల్లూరి విగ్రహానికి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ నిర్వాహకులు గోలి చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.పవన్ కుమార్, చిల్లపల్లి మోహన్‌రావు, ఎస్ఎస్ఎన్ గాంధీ, గంధం చంటి, చుండూరి అబ్బయ్య తదితరులు ఉన్నారు.

అల్లూరి, వంగవీటిలకు ఘన నివాళి

కొయ్యలగూడెం: స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ జ్యోతి అల్లూరు సీతారామరాజు, దివంగత ఎమ్మెల్యే, కాపునాడు ఉద్యమ నేత వంగవీటి మోహన రంగాల జయంతి కార్యక్రమాలు శుక్రవారం త్రిబుల్ ఆర్ సెంటర్లో నిర్వహించారు. ఆ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుప్పట్ల పంపిణీ చేశారు. యువత అల్లూరి, వంగవీటి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లో రాణించాలి అని నాయకులకు పేర్కొన్నారు. చోడిపిండి సుబ్రహ్మణ్యం, తాడికొండ మురళి, మేకల అన్నవరం, మంతెన సోమరాజు, మట్టా సత్తిపండు, విగ్గిన సూరిబాబు, సంకు మధు, రోటరీ క్లబ్, మానవత సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల కార్యాలయంలో..

టి.నరసాపురం: స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో అల్లూరి సీతారామరాజుకి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు రామకృష్ణ, గుడి వెంకటరావు మాట్లాడారు. అనుమోలు మురళి, మాడకం కుమారి, మడకం సుధారాణి, ఎస్.సూర్యరావు తదితరులు పాల్గొన్నారు. సాలిగూడెంలో గ్రామ శాఖల ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు నగర్‌లో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిల్లి రామకృష్ణ మాట్లాడుతూ అల్లూరి పోరాట స్ఫూర్తితో మోదీ ప్రభుత్వ సామ్రాజ్యవాద విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గుడెల్లి వెంకటరావు, అనుబోలు మురళి, సూర్యారావు, సరియ దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి

బుట్టాయగూడెం: అల్లూరి సందర్భంగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆయన చిత్రపటానికి ఏపీఈపీడీసీ ఎస్ఈ సాల్మన్‌రాజు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీ ఈ. ఫీర్ అహ్మద్‌ఖాన్, డీఈ టెక్నికల్ రాధాకృష్ణ, ఏఈ శ్రీనివాస్‌వర్మ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోశయ్యకు ఘన నివాళి


రోశయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కొయ్యలగూడెం: మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 92వ జయంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కన్నాపురం రోడ్డులోని టెంపుల్స్ సెంటర్లో ఉన్న రోశయ్య విగ్రహానికి ఆర్య వైశ్య సంఘం ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోశయ్య కీర్తిని కొనియాడారు. మాటూరు సుధీర్, కంభంపాటి సాయి, బొమ్మ బాబు, మాజేటి సత్యనారాయణ, చిరవూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

చింతలపూడి : చింతలపూడిలో ఈనెల 5, 6, 7 తేదీల్లో నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య కోరారు. పార్టీ స్థానిక కార్యాలయంలో మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు మామిల్లపల్లి వసంతరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణ చైతన్య మాట్లాడారు. నాయకులు తొర్లపాటి బాబు, కంచర్ల గురవయ్య, ఎస్‌కే కాలేషా, ముల్లగిరి నాగేశ్వరరావు, ముల్లగిరి అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలపై నిలదీద్దాం


సమావేశ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కంభం విజయరాజు, నాయకులు

వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజయరాజు

కామవరపుకోట: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బాబు షూరిటీ – మోసం గ్యారంటీపై శనివారం చింతలపూడి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు తెలిపారు. శుక్రవారం సభా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలతో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ నాయకుల మోసపూరిత హామీలను ఎండగట్టేందుకు ప్రతి ఒక్కరూ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సభకు ముఖ్య అతిథులుగా ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ పరిశీలకులు వంకా రవీంద్రనాథ్, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, ఏలూరు పార్లమెంట్ కోఆర్డినేటర్ కారుమూరి సునీల్ కుమార్, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు జెట్టి గురునాథరావు, పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ నియమితులైన రాయంకుల సత్యనారాయణను మండల వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులకు అభినందనలు


నాగును అభినందిస్తున్న నాయకులు


నాగేంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చింతలపూడి : వైఎస్సార్ సీపీ చింతలపూడి పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన కొప్పుల నాగేశ్వరరావు (నాగు)ను ఆపార్టీ మండల నాయకులు అభినందించారు. పార్టీ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు ఇంటి వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నాగును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగు పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు, జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావులకు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మాగసాని గురుబ్రహ్మం, నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు ఎం దిలీప్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎస్ కాంతారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఎ.సుబ్బారావు, పార్టీ నాయకులు త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ఎస్ దుర్గారావు, గోలి చంద్రశేఖర్ రెడ్డి, రామరాజు నాయక్, పి మాధవరెడ్డి, జి రాజేష్ నాయుడు,గోపి, సోషల్ మీడియా కన్వీనర్ దాసు తదితరులు పాల్గొన్నారు.

నాగేంద్రకు శుభాకాంక్షలు

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా నియమితులైన ఓరుగంటి నాగేంద్రకు ఆపార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం రాత్రి వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు నాగేంద్రను మంగిశెట్టిగూడెంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో కనికళ్ల ప్రసాద్‌బాబు, పల్లా గంగాధరరావు, వీరంకి సత్యనారాయణ, అయినాల సతీష్, పాపోలు వెంకటేశ్వరరావు, సాకిరి సోమరాజు, సత్రం శేషగిరి, పసుపులేటి కిషోర్, తూటికుంట వెంకటరావు, ఘంటశాల ప్రభాకరరావు, ఓరుగంటి రామారావు, చీదరాల నాగేశ్వరరావు, చీదరాల చక్రవర్తి, నిమ్మ గురునాథరెడ్డి, పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ నిమ్మ రామకృష్ణ, చిల్ల దుర్గారెడ్డి, చిట్టిబొమ్మ శివ, చందా రామకృష్ణ, చల్లా రామకృష్ణ, పత్తి వీరాస్వామి, మస్తాన్, కుంభం వీరాస్వామి, బండారు సుబ్బారావు, విజనగిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగిస్తాం


సమావేశానికి హాజరైన చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు

కొయ్యలగూడెం: గణేష్ సెంటర్ నుంచి మొదలుకొని కన్నాపురం రోడ్డులో సురక్ష హాస్పిటల్ వరకు ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగిస్తామని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రభుత్వ అధికారులకు హామీ ఇచ్చింది. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి కె.సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో చాంబర్ అధ్యక్షుడు మద్దు మోహన్ నేతృత్వంలో సభ్యులు ఈ మేరకు హామీ ఇచ్చారు. రోడ్డు ఆక్రమణపై పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు ఇప్పటికే 84 మంది వ్యాపారులకు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమస్య పరిష్కార సదస్సుల్లో సూచనలు సలహాలు దరఖాస్తు రూపంలో స్వీకరించారు. కొందరు దుకాణదారులు డ్రెయినేజీని సైతం ఆక్రమించి చిరు వ్యాపారులకు రోజువారి అద్దెకి ఇచ్చి బాడుగ వసూలు చేస్తున్నారని కార్యదర్శి సురేష్ తెలిపారు. నిర్ణీత గడువులోగా ఆక్రమణలను తొలగించని పక్షంలో పంచాయతీ తరపున తొలగింపు చర్యలు చేపడతామని చెప్పారు.

విద్యార్థులకు మొక్కలు పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు, రైతులు

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం పొగాకు బోర్డు అధికారులు, రైతుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పలువురు విద్యార్థులకు జంగారెడ్డిగూడెం ఆక్షన్–18 సూపరింటెండెంట్ బి.శ్రీహరి చేతుల మీదుగా విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. కేంద్రీయ పొగాకు బోర్డు స్వర్ణోత్సవాల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు శ్రీహరి తెలిపారు. సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ సుధీర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఠాగూర్, ప్రణతి కుమార్, రైతులు గద్దే బాబూరాజేంద్రప్రసాద్, అల్లూరి సోమేశ్వరరావు, తాండ్రు వీరకృష్ణ, పసుమర్తి వీరకృష్ణ, బిక్కిన నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిగూడెంలో కార్డన్ సెర్చ్


గ్రామంలో ఆపరేషన్ నిర్వహిస్తున్న పోలీసులు

చింతలపూడి: మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామంలో శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎక్సైజ్ అధికారులతో కలిసి గ్రామంలో సారా తయారీ, అక్రమ విక్రయాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. సుమారు 460 ఇళ్లలో తెల్లవారుజాము నుండే అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ క్రాంతి కుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల నిర్మూలన, అసాంఘీక కార్యకలాపాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సారా తయారీ, అమ్మకాలపై డయల్ 112కి లేదా సీఐ ఫోన్ నంబర్ 94407 96674కు, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ ఆవులయ్య, సీఐ పి.అశోక్ కుమార్, ఎస్సై సతీష్ కుమార్, పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి


ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కుక్కునూరు: ఖాళీగా ఉపాధ్యాయులు పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కొలికపోగు లెనిన్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో కోఆర్డినేటర్ పోతురాజుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సరిపడ ఉన్నా ఉపాధ్యాయులు లేరని తెలిపారు. కుక్కునూరు మండల వ్యాప్తంగా 32 ఎంపీపీఎస్, 11 ఎంపీయూపీఎస్, 3 జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలు ఉన్నాయని, మూడు వేలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా పూర్వ సహాయ కార్యదర్శి యర్నం సాయికిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే కౌన్సెలింగ్ చేపట్టి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు నిరుద్యోగులను వలంటీర్లుగా నియమించాలని కోరారు.

సమ్మె నోటీసు అందజేత

జంగారెడ్డిగూడెం: ఈనెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ కేవీ రమణను కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు కూనపాముల విఘ్నేష్, కుంచె వసంతరావులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక , కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ పెట్టుబడిదారుల కొమ్ముకాస్తోందని ఆరోపించారు.

ఇంజినీరింగ్ కార్మికుల వినతి

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈనెల 03 నుంచి 14 వరకు దశలవారి కార్యక్రమం నిర్వహించనున్నట్టు విగ్నేష్ తెలిపారు. 15న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ మేరకు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామని పేర్కొన్నారు.

మర్యాదపూర్వక కలయికలు


మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మికి మొక్కను అందిస్తున్న గవరయ్య గుప్తా


పార్టీ ఇన్‌చార్జి విజయరాజును కలిసిన శాంతారావు

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ జంగారెడ్డిగూడెం పట్టణ నూతన అధ్యక్షుడిగా నియమితులైన కర్పూరం గవరయ్య గుప్తా శుక్రవారం స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేసే వారికి పదవులు ఎప్పుడూ వరిస్తాయన్నారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పార్టీ ఉన్నతికి కృషిచేయాలని గుప్తాకు సూచించారు. పార్టీ నాయకులు బత్తిన చిన్న తదితరులు పాల్గొన్నారు.

విజయరాజును కలిసిన శాంతారావు

లింగపాలెం: వైఎస్సార్ సీపీ లింగపాలెం మండలం అధ్యక్షుడిగా నియమించిన అన్నపనేని శాంతారావు శుక్రవారం పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. విజయరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండలం నాయకులు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విజయరాజును కలిసిన వారిలో పార్టీ మండల ముఖ్య నేత మునునూరు వెంకటేశ్వరరావు, నాయకులు చీదరాల ప్రసాదు, గణేషు ఉన్నారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

జంగారెడ్డిగూడెం: సమస్యల పరిష్కారం కోరుతూ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ స్థానిక డిపో వద్ద శుక్రవారం ధర్నా చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రీజినల్ జాయింట్ సెక్రెటరీ బీవీఎస్ఎస్ రంగనాయకులు మాట్లాడుతూ ఆర్టీసీలో వివిధ శాఖల్లో ఉన్న ఉద్యోగులకు ప్రమోషన్ కల్పించాలని, 11వ పీఆర్సీ 24 నెలల ఏరియర్‌లు చెల్లించాలని, ఉద్యోగ భద్రతకు ఎంప్లాయిస్ యూనియన్ ఏర్పాటుచేసి సర్క్యులర్ 1/2019 అమలుకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బస్సులు లీజుకు ఇచ్చే పద్ధతి మానుకోవాలని కోరారు. సీసీఎస్ ఆఫీసును ఎండీ ఆఫీస్ వద్దే కొనసాగాలని, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాడ్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాలం చెల్లిన బస్సులు స్థానంలో కొత్తవి ప్రవేశపెట్టాలని కోరారు.

వంగవీటి మోహనరంగాకు ఘన నివాళి


జంగారెడ్డిగూడెం : వంగవీటి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


పోలవరం : మోహనరంగా జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా జంగారెడ్డిగూడెంలోని ఆయన విగ్రహానికి వివిధ పార్టీల కాపు ప్రముఖులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు మాట్లాడుతూ మోహనరంగా ఒక్క కాపు కులానికే కాకుండా, బడుగు బలహీన వర్గాల అందరికీ నాయకుడని అన్నారు. బాధరాల నరేష్, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, రావూరి కృష్ణ, సింగంశెట్టి సత్తిరాజు, దాకారపు కృష్ణ, చింతల నాని, ఉక్కుర్తి సీతారాం, సంకు ప్రభాకర్ రావు, దాసరి శేషు, కొండవీటి చిట్టిబాబు, మద్దాల ప్రసాద్, బల్లె పండు, దొండపాడు పండు పాల్గొన్నారు.

చింతలపూడిలో..

చింతలపూడి : స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో రంగా విగ్రహానికి వివిధ రాజకీయ పార్టీలు, కాపు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా సేవలను కొనియాడారు. వంగవీటి మోహనరంగా విగ్రహ నిర్మాణ, అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు కొత్తపూడి శేషగిరి రావు, ప్రెసిడెంట్ తోట శివ నాగరాజు (నాని), వైస్ ప్రెసిడెంట్ తూము విజయ్ కుమార్, సెక్రెటరీ ముత్యాల శ్రీనివాస్ (చిన్ని), మంచనపల్లి రాఘవేంద్రరావు, పట్టణ ప్రముఖులు, మారుమూడి ధామస్, తాటి అప్పారావు, చీదరాల మధుబాబు, ఆర్నేపల్లి అప్పారావు, గంధం చంటి, తోట పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

వంగవీటి జయంతి

పోలవరం రూరల్: మండలంలో నూతన గూడెంలో రంగా విగ్రహానికి ఎంపీపీ చాంబర్ ఏలూరు జిల్లా అధ్యక్షులు, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్‌ను కట్ చేశారు. కాపు నాయకులు కొణతాల ప్రసాద్, గుణపర్తి చిన్ని, కుంచె దొరబాబు, పాదం ప్రసాద్, సిగ్గన వెంకటరత్నం, జల్లేపల్లి రాజా, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వెండి సమర్పణ

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మవారి రజత వస్త్ర నిర్మాణానికి ఆరేపల్లి రామారావు, మహాలక్ష్మి దంపతులు 5 తులాల వెండిని సమర్పించారని ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు.